క్లుప్తంగా

కాలువలను ఆక్రమిస్తే చర్యలు



జేసీబీ సహాయంతో పలకల తొలగింపు

వీరఘట్టం: మురుగు కాల్వలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మేజర్ పంచాయతీ ఈఓ బి.కోటేశ్వరరావు స్పష్టం చేశారు. సోమవారం స్థానిక అంబేడ్కర్ జంక్షన్ నుంచి గెంబలివీధికి వెళ్లే రహదారిలో కాల్వలపై ఉన్న ఆక్రమణలు సోమవారం తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలువలపై ఆక్రమణలు పెరిగిపోవడంతో పారిశుధ్య పనులు చేపట్టలేకపోతున్నామని చెప్పారు. అంబేడ్కర్ జంక్షన్ నుంచి ఆస్పత్రి రోడ్డు వరకు.. గొడవీధిలోని కాల్వలపై ఉన్న ఆక్రమణలను వ్యాపారులు స్వచ్ఛందంగా తొలగించాలని, లేని ఎడల శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

పీఏసీఎస్ సభ్యుల ప్రమాణ స్వీకారం

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండల కేంద్రంలో పీఏసీఎస్(ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం) సభ్యుల ప్రమాణ స్వీకారం సోమవారం జరిగింది. చైర్మన్ డొల్లు కిశోర్‌కుమార్, డైరెక్టర్లు తంగుడు సత్యనారాయణ, కర్రి సత్యనారాయణ, ఇతర సభ్యులతో ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ప్రమాణం చేయించారు.

కుట్టుమిషన్ శిక్షణతో జీవనోపాధి మెరుగు



శిక్షణ పొందుతున్న మహిళలు

జియ్యమ్మవలస రూరల్: మహిళలకు ఇచ్చే కుట్టుమిషన్ శిక్షణ ద్వారా జీవనోపాధి మెరుగు పడుతుందని ట్రైనర్ బిందు తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద ఇస్తున్న శిక్షణకు సోమవారం హాజరైన అభ్యర్థులను ఉద్దేశించి, ఆమె కాసేపు మాట్లాడారు. మూడు నెలల పాటు ఇచ్చే ఈ శిక్షణ పూర్తయినానంతరం ధ్రువీకరణ పత్రంతో పాటు కుట్టు మిషన్ అందివ్వడం జరుగుతుందన్నారు. ఇంటి వద్దనో ఏదైనా పెద్దషాపులో పనిచేస్తూనో ఉపాధి పొందవచ్చన్నారు.

వీఆర్‌ఏలతో ఊడిగం!



మండల రెవెన్యూ కార్యాలయం వద్ద వీఆర్‌ఏలతో పిచ్చిమొక్కలు తొలగిస్తున్న దృశ్యం

జియ్యమ్మవలస రూరల్: ప్రభుత్వం వీఆర్‌ఏలతో ఊడిగం చేయిస్తున్నారన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. దీనికి సాక్ష్యం ఈ చిత్రంలో పిచ్చిమొక్కలు పీకుతున్న వీఆర్ ఏలే. మండల రెవెన్యూ అధికారుల ఆదేశాల మేరకు రేషన్ పంపిణీ, పథకాలు, ప్రభుత్వ కార్యక్రమాలు, అధికారుల సమావేశాలు, గ్రామసభలు, వరదలు తదితర అంశాలపై దండోరా ద్వారా ప్రచారం చేయాల్సిన వీరితో ఇలా చెత్తాచెదారం తొలగింపజేయడం, ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు, డొంకలను తొలగించేందుకు మందులు పిచికారీ చేయించడం వంటివి చేయిస్తున్నారు. గతంలో ఓసారి వారే తమ సొంత డబ్బులతో జేసీబీలు, ఇతర యంత్రాలను పెట్టిమరీ ఇలాంటి పరిసరాల పరిశుభ్రతా చర్యలు చేపట్టారన్న ప్రచారం జోరుగా జరుగుతోంది. ఇప్పుడు మళ్లీ ఇదే వీఆర్‌ఏలు మండల రెవెన్యూ కార్యాలయం వద్ద శ్రమదానం చేపట్టడం కనిపించింది. వారి పనేంటి? వారితో చేయిస్తున్న పని ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఏది ఏమైనా ఉద్యోగులను ఏ విధంగా వాడుకోవాలో ఈ ప్రభుత్వానికి తెలిసినంతగా వేరెవ్వరికీ తెలియదని అంటున్నారు.

టి.దత్తివలసలో వైద్య శిబిరం ఏర్పాటు



వైద్య శిబిరం నిర్వహిస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్...

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని చింతలబెలగాం పంచాయతీ, టి.దత్తివలస గ్రామంలో జ్వరాల విజృంభణపై దత్తివలసను పట్టిపీడిస్తున్న విషజ్వరాల శీర్షిక పేరిట ఈ నెల 10వ తేదీన సాక్షి దినపత్రికలో వార్తా కథనం ప్రచురితమైంది. ఈ మేరకు స్పందించిన అధికార యంత్రాంగం గ్రామంలో సోమవారం వైద్య శిబిరం ఏర్పాటు చేయించింది. జియ్యమ్మవలస పీహెచ్‌సీ వైద్యాధికారి పి.జగదీష్ ఆధ్వర్యంలో సిబ్బంది గ్రామస్తులకు ఆరోగ్య తనిఖీలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కొంతమందిని మెరుగైన వైద్యం కోసం ప్రభుత్వ ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నారు.

బాలికల వసతి గృహం ప్రారంభానికి సిద్ధం..

- 100 మంది బాలికలను చేర్పించేందుకు సన్నాహాలు
- 6వ తరగతి నుంచి ఇంటర్ విద్యార్థినులకు మాత్రమే అవకాశం
- సిబ్బంది నియామకానికి విద్యాశాఖ కసరత్తు



ప్రారంభానికి సిద్ధమైన సమీకృత బాలికల వసతిగృహం

వీరఘట్టం:

మండల కేంద్రంలో నిర్మించిన సమీకృత బాలికల వసతిగృహం ప్రారంభానికి సిద్ధమవుతోంది. చాలా సంవత్సరాలుగా నిర్మాణంలో ఉన్న ఈ భవనం పనులు ఎట్టకేలకు పూర్తి కావడంతో ఇటీవల విద్యాశాఖ అధికారులు ఈ భవనాన్ని పరిశీలించారు. మరో పది రోజుల్లో వసతిగృహాన్ని ప్రారంభించేందుకు కార్యాచరణ చేపట్టారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివే 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థినులకు ఇక్కడ వసతి కల్పించనున్నారు. వీరఘట్టం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న 50 మంది ఇంటర్మీడియట్ బాలికలను ఇప్పటికే గుర్తించారు. అలాగే స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో చదువుతున్న మరో 50 మంది బాలికలతో కలిపి మొత్తం 100 మంది బాలికలను మొదటి ఏడాది చేర్పించి ఈ వసతిగృహాన్ని ప్రారంభించనున్నారు. అలాగే ఈ వంద మంది బాలికలను పర్యవేక్షించేందుకు ఒక వార్డెన్‌ను, వీరికి సాయంత్రం ట్యూషన్ చెప్పేందుకు ఒక ట్యూటర్‌ను, కుక్కు, హెల్పర్, స్వీపర్, నైట్ వాచ్‌ఉమెన్‌లను నియమించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అయితే ఈ పోస్టులు సిఫార్సులతో వేస్తారా లేకా నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేస్తారా అనేది తెలియాల్సి ఉంది.

త్వరలోనే ప్రారంభిస్తాం

సమీకృత బాలికల వసతిగృహాన్ని వంద మంది బాలికలతో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నాం. ఇప్పటికే ఇంటర్మీడియట్ బాలికలను గుర్తించాం. అలాగే వీరఘట్టంలో ఉన్న జిల్లా పరిషత్ హైస్కూల్స్ నుంచి 50 మంది బాలికలతో ఈ హాస్టల్ ప్రారంభిస్తాం. ఉన్నతాధికారుల సూచనలతో సిబ్బందిని కూడా నియమించి మరో పది రోజుల్లో బాలికల హాస్టల్ ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

– తేజేశ్వరరావు, ఏపీసీ, సమగ్ర శిక్ష, పార్వతీపురం మన్యం జిల్లా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండలంలోని పలు ప్రాంతాలకు మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు ఆ శాఖ డీఈఈ ఎం.రాజేంద్రప్రసాద్ ఓ ప్రకటనలో సోమవారం వెల్లడించారు. పార్వతీపురం నుంచి కురుపాం వస్తున్న 33 కేవీ లైన్‌ను తాకే చెట్లకొమ్మలు తొలగిస్తున్న నేపథ్యంలో ఈ అసౌకర్యం కలుగుతోందన్నారు. కురుపాం, కిచ్చాడ, కస్పాగదబవలస, వెంకటాపురం తదితర ప్రాంతాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ ఇబ్బంది ఉంటుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

జియ్యమ్మవలస రూరల్: చినకుదమ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో పలు ప్రాంతాలకు మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు ఆ శాఖ అధికారి బి.శంకరరావు ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. 33 కేవీ లైన్‌ను తాకే చెట్లకొమ్మల తొలగింపు పనులు సహా సబ్‌స్టేషన్‌లో నిర్వహణ పనుల కారణంగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు చినకుదమ, తురకనాయుడువలస, నీచుకవలస, సింగనాపురం, గెడ్డతిరువాడ, కుందరతిరువాడ, ఇటిక, పెదకుదమ, గౌరీపురం, చింతలబెలగాం గ్రామాలకు కరెంట్ సరఫరా ఉండదన్నారు.

రైతులను దోచుకుంటున్నారు



కీసరలో రైతులతో కలిసి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కళావతి

- మాజీ ఎమ్మెల్యే కళావతి

భామిని: టీడీపీ నాయకులు రైతులను దోచుకోవడానికి పోటీ పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ఆరోపించారు. మండలంలోని కీసరలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బోదెపు శ్రీనివాసరావు, మండల సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు మజ్జి మోహనబాబు, తదితరులతో కలసి రైతులతో సోమవారం మాట్లాడారు. వ్యవసాయాధికారుల సహకారంలో ప్రైవేట్ డీలర్లు అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తున్నారన్నారు. వ్యవసాయ రంగాన్ని ఆదుకోవాలని నాడు జగనన్న రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేస్తే.. నేడు కూటమి ప్రభుత్వం వాటిని నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. అరకొరగా వచ్చిన ఎరువులను కూడా కూటమి నాయకులు దోచుకుని, రైతులను మోసగిస్తున్నారన్నారు. అధికారులు తక్షణమే ప్రైవేట్ డీలర్లకు అందించిన ఎరువుల జాబితాలు తనిఖీలు చేసి రైతులందరికీ ఎరువులు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పిన్నింటి హరిబాబు, పతివాడ రవణమ్మ, వలరౌతు రామకృష్ణ, మేడిబోయిన చలపతి, పిరపక శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో హామీలే మిగిలాయి



చంద్రబాబు మోసాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సీతంపేట: కూటమి పాలనలో హామీలే మిగిలాయని జెడ్పీ కో ఆప్షన్ సభ్యురాలు ఎస్.లక్ష్మి అన్నారు. మండలంలోని రాజన్నగూడ, చింతాడ పంచాయతీలోని పలు గ్రామాల్లో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. సూపర్‌సిక్స్ హామీలు అమలు చేయకపోవడం వల్ల ఒక్కో కుటుంబం ఎంత నష్టపోయినదీ వివరించారు. అలాగే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ఈ సందర్భంగా గుర్తు చేశారు. హామీలను అమలు చేయని కూటమి నాయకులను నిలదీయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు చంద్రశేఖర్, పాలకొండ నియోజకవర్గ ఎస్టీ సెల్ కన్వీనర్ నిమ్మక కాంతారావు, సర్పంచ్ ఆనప, షోడంగ, రామారావు, అజయ్‌కుమార్, సరోజిని చంద్రయ్య, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

సాక్షి ఎఫెక్ట్...

పాలకొండ రూరల్: పట్టణంలోని శివారు ప్రాంతాల్లో నెలకొన్న తాగునీటి సమస్యను అధికారులు పరిష్కరించారు. ప్రజల ఇబ్బందులపై సోమవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి నగర కమిషనర్ రాజరత్నం స్పందించారు. స్థానిక తెలకలవాని చెరువు సమీపంలో మరమ్మతులకు గురైన పైప్‌లైన్లను పునరుద్ధరించారు. ఈ సందర్భంగా నగర కమిషనర్ మాట్లాడుతూ.. భూ అంతర్భాగంలో పైపులైన్లు లీకవడంతో సరఫరా నిలిచిపోయిందన్నారు. పరిష్కారానికి శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు చేపడుతున్నట్లు చెప్పారు.

రాష్ట్రంలో కూటమి అరాచక పాలన



కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు

జియ్యమ్మవలస రూరల్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అరాచక పాలన చేస్తోందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కోట రమేష్‌నాయుడు విమర్శించారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పరజపాడు పంచాయతీలో సోమవారం పర్యటించిన ఆయన..ఇంటింటికీ వెళ్లి కూటమి మోసాలను వివరించారు. కూటమి పాలనంతా మోసమేనని, అధికారంలోకి వచ్చి ఏడాది కాలం దాటినా ఇంతవరకు ఎన్నికల హామీలన్నీ అమలు చేయలేకపోయారని మండిపడ్డారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం పట్టించుకోకుండా చంద్రబాబు పాలన చేస్తున్నారని, ప్రజలంతా గమనిస్తున్నారన్నారు. రెడ్‌బుక్ పేరిట ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా యాక్టివిస్టులపై దాడులకు ఉసిగొల్పుతూ కక్షపూరిత రాజకీయాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తుండడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా ప్రజలకు మంచి చేసే పనులు చేయాలని, కుట్రపూరిత రాజకీయాలు మానుకోవాలని హితవుపలికారు. త్వరలోనే ఈవీఎం స్కామ్ బయటకు వస్తుందని, సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సంపత్‌కుమార్, లోలుగ నారాయణరావు, బలగ వెంకటరమణ, శెట్టి తాతబాబు, మన్మథరావు, సత్యంనాయుడు, అనంతనాయుడు తదితరులు పాల్గొన్నారు.

తనిఖీలు

వీరఘట్టం: మండల కేంద్రంలోని రెండు ఎరువుల షాపుల్లో వ్యవసాయ శాఖ ఏడీఏ రత్నకుమారి, ఏఓ జె.సౌజన్య సోమవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. వివరాలు సక్రమంగా లేకపోవడంతో ఓ దుకాణంలో రూ. 9.74 లక్షల విలువ గల ఎరువుల అమ్మకాలు నిలుపుదల చేయాలని ఆదేశించారు. ఎరువులు అధిక ధరలకు విక్రయించినా, నిషేధిత పురుగు మందులు విక్రయించినా షాపు సీజ్ చేస్తామని హెచ్చరించారు.

యథావిధిగా పాఠశాలను కొనసాగించాలి



పాఠశాలను యథావిధిగా కొనసాగించాలని గుమ్మలక్ష్మీపురం మండలం, దుడ్డుఖల్లు పంచాయతీ, కొత్తవలస గ్రామస్తులు కోరుతున్నారు. ఇదే విషయమై వారు పాఠశాల ఎదుట సోమవారం ఆందోళనకు దిగారు. గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆదర్శ పాఠశాలగా మార్చేసి, ఇక్కడి విద్యార్థులను దుడ్డుఖల్లు పాఠశాలకు తరలించడం దుర్మార్గమన్నారు. తమ పిల్లలు రోజూ కాలినడకన ఆ పాఠశాలకు వెళ్లి రావాల్సి వస్తోందని, దీంతో వారు అలసట చెంది చదువుపై అంతగా శ్రద్ధ వహించలేకపోతున్నారని వాపోయారు. ఇక్కడే తమ బిడ్డలు చదువుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, తమ గోడును ప్రభుత్వానికి తెలియజేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు మాజీ సర్పంచ్ నిమ్మక కంశాలమ్మ, నిమ్మక ఉదయ్‌కుమార్, కద్రక రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

–గుమ్మలక్ష్మీపురం

పరామర్శలు..



లోహరిజోలలో మృతుని కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి, తదితరులు

భామిని: మండలంలోని పలు గ్రామాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి సోమవారం బాధిత కుటుంబాలను పరామర్శించి, ఓదార్చారు. లోహరిజోల, నులకజోడు, బిల్లుమడ, దిమ్మిడిజోల, సొలికిరి, బాలేరు, కీసర, పెద్ద దిమిలి గ్రామాల్లో పర్యటించి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు గెల్లంకి రాంబాబు, సాసుపిల్లి విశ్వనాథం, కొత్తూరు ప్రసాద్, సిగడాన రాజు, కొత్తకోట చంద్రశేఖర్, రొక్కం రామారావు, తొగరాన శ్రీను, బియ్యాల జయరామ్, కాగితాపల్లి కృష్ణారావు, కార్యకర్తలున్నారు.

అర్జీదారు సంతృప్తి చెందాలి

- కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్
- సమస్యల పరిష్కారానికి 96 అర్జీలు

పార్వతీపురం రూరల్: పీజీఆర్ఎస్‌కు సమస్యల పరిష్కారం కోసం 96 అర్జీలు సోమవారం కలెక్టరేట్‌కు వచ్చినట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ చెప్పారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక, పీఆర్‌ఓ హేమలత, డీఆర్‌డీఏ పీడీ సుధారాణిలతో కలిసి అర్జీలు స్వీకరించినట్లు కలెక్టర్ తెలిపారు. సమస్యల పరిష్కారంలో అర్జీదారు అసంతృప్తి చెందకూడదని అధికారులకు స్పష్టం చేశారు. వచ్చిన అర్జీలలో ప్రధానంగా పార్వతీపురం మండలంలోని తాగునీటి సమస్యపై, అలాగే గ్రామంలోని అనారోగ్య పరిస్థితులపై విన్నవించగా సంగంవలస పరిధిలో రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలని కొంతమంది దరఖాస్తు చేశారు. అలాగే పాచిపెంట మండలం తాడూరు, శీల గ్రామానికి చెందిన 31 మంది రైతులకు పట్టాలు మంజూరు చేయాలని వినతిపత్రం సమర్పించారు. అన్నదాత సుఖీభవ, దివ్యాంగుల సమస్యలు, తల్లికి వందనం తదితర సమస్యలపై జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను అర్జీల ద్వారా విన్నవించారు. అలాగే అర్జీదారులకు దాతల సాయంతో కలెక్టరేట్ ప్రాంగణంలో ఉచితంగా భోజన సదుపాయం ఏర్పాటు చేశామని ప్రతి అర్జీదారు భోజనం చేసి వెళ్లాని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో దాతలు భాగస్వామ్యం అయ్యేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు తదితర సిబ్బంది ఉన్నారు.



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్



సీతంపేట: అర్జీలు స్వీకరిస్తున్న ఏపీఓ చిన్నబాబు

చట్టపరిధిలో ఫిర్యాదుల పరిష్కారం

పార్వతీపురం రూరల్: నిర్దేశించిన సమయంలోనే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన ఫిర్యాదులను చట్ట పరిధిలో పరిష్కరించాలని ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి సంబంధిత పోలీసు శాఖాధికారులకు స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లాలో ఉన్న పలు స్టేషన్ల పరిధిల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల అర్జీలను స్వీకరించి, అర్జీదారులతో ఎస్పీ ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రధానంగా వచ్చిన ఫిర్యాదుల్లో సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఎస్పీ ఫోన్లో మాట్లాడి ఫిర్యాదు అంశాలను పరిశీలించి, వాటి పూర్వాపరాలను విచారణ చేసి, ఫిర్యాదు అంశాలు వాస్తవాలైనట్లయితే చట్ట పరిధిలో తక్షణ చర్యలు చేపట్టాలని, తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలని ఆదేశించారు. కార్యక్రమంలో మొత్తం 5 ఫిర్యాదులు అందాయి. డీసీఆర్బీ సీఐ సుధాకర్, ఎస్ఐ ఫకృద్దీన్ తదితర సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.



సమస్యల పరిష్కారానికి ఫోన్‌లో ఆదేశాలు జారీ చేస్తున్న ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి

ఐటీడీఏ పీజీఆర్ఎస్‌కు 39 వినతులు

సీతంపేట: స్థానిక ఐటీడీఏలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ (ప్రజాసమస్యల పరిష్కార వేదిక)కు 39 వినతులు వచ్చాయి. ఐటీడీఏ ఏపీఓ జి.చిన్నబాబు ఆర్జీలు స్వీకరించారు. భామిని మండలం యాతంగూడకు చెందిన గ్రామస్తులు గ్రామంలో సామాజిక భవనం నిర్మించాలని అర్జీ ఇచ్చారు. కోసింగూడ గ్రామస్తురాలు ఆరిక విజయ కుట్టు మిషన్ ఇప్పించాలని కోరింది. సవర పోలూరు గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ గ్రామానికి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశాడు. భాషావలంటీర్ పోస్టు ఇప్పించాలని జన్నిగూడకు చెందిన బెనర్జీరావు, తల్లికి వందనం పథకం మంజూరు కాలేదని అందజేయాలని మాలిపేటకు చెందిన మహలక్ష్మి కోరారు. ఆటోలోన్ ఇప్పించాలని నాగులు గూడ గ్రామస్తుడు నిమ్మక సింహాచలం విన్నవించాడు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ డీడీ అన్నదొర, డిప్యూటీఈవో రామ్మోహన్‌రావు, స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ జాకాబ్ దయానందం, వ్యవసాయాధికారి వాహిని, సీడీపీఓ సిమ్మాలమ్మ, ఏఎంవో కోటిబాబు, హెచ్‌వో జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ



జాతీయ జెండా ప్రదర్శిస్తున్న విద్యార్థులు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండల కేంద్రంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు హర్ ఘర్ తిరంగా ర్యాలీ సోమవారం చేపట్టారు. ప్రతిఒక్కరూ జాతీయ జెండాను గౌరవించాలని, ఆగస్టు 15వ తేదీన జరిగే స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొని దేశభక్తి చాటుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు. ప్రతి ఇంటిపైనా జాతీయ జెండా ఎగురవేసేలా చూసుకోవాలన్నారు. అనంతరం జాతీయ జెండాను ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.కుమారస్వామి పాల్గొన్నారు.

భామిని: మండల కేంద్రంలోని జీజేసీ విద్యార్థులు హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎస్ఎల్‌వీ నారాయణరావు మాట్లాడుతూ.. జాతీయ పతాకం ఆవశ్యకతను వివరించారు. అనంతరం డాక్టర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు.



భామిని: అంబేడ్కర్ విగ్రహం వద్ద మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు

ఆటో డ్రైవర్ల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఆటో కార్మికులు

పాలకొండ: కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు అమలు చేయక ముందు ఆటో డ్రైవర్ల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో ఆటో కార్మికులు పట్టణంలో ఆటోలతో సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. కోటదుర్గమ్మ ఆలయం నుంచి ప్రధాన రహదారిలో తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రమణారావు మాట్లాడుతూ.. ఎన్నికల ముందు కూటమి నాయకులు ఆటో డ్రైవర్లకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ హామీ మేరకు ఆటో డ్రైవర్లకు వాహనమిత్ర పథకం అమలు చేసి ప్రతి ఒక్కరికీ రూ. 25 వేల చొప్పున అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ రాధాకృష్ణమూర్తికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కాద రాము, పి. రాజశేఖర్, పి.మహేష్, పి. రాము, ఎన్. సుదర్శనరావు, ఎస్. కామేష్, పాల్గొన్నారు.

కృష్ణాష్టమి వేడుకలకు సహకరించాలి

పాలకొండ రూరల్: త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఇందూజ్ఞాన వేదిక (శ్రీకాకుళం) నేతృత్వంలో ఈనెల 16న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించనున్నారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో వేడుకలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యుడు పొట్నూరు సంతోష్‌కుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించి అవసరమైన బందోబస్తుతో పాటు వేడుకలను నిర్వహించుకునేందుకు అవకాశం కల్పించాలని పాలకొండ సీఐ చంద్రమౌళిని సోమవారం కలిసి కోరారు. వేడుకలకు సంబంధించిన పోస్టర్లను సీఐ, తదితరులు ఆవిష్కరించారు.

అతివేగం పనికిరాదు



అవగాహన కల్పిస్తున్న ఎస్సై అమ్మన్నరావు

సీతంపేట: అతివేగం పనికిరాదని ఎస్సై వై.అమ్మన్నరావు సూచించారు. సోమవారం స్థానిక సంతమార్కెట్ వద్ద వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఘాట్‌రోడ్డులో జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలని సూచించారు.